


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెళ్ళి విందు

**ఆ దోశ వేసేవాడి** ముందు చేతిలో ప్లేట్స్ పట్టుకుని ఎంత పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్ళయినా నించోవాల్సిందేనా పెళ్ళి బఫేల్లో? సమంతా బంగారం షాప్ ఓపెనింగ్‌కి వచ్చింది అంటే పరిగెత్తే వాళ్ళలా.... పెళ్ళిళ్ళల్లో దోశకి సమంతా స్టాటస్ ఇచ్చేసారు.

అదే పెళ్ళాం "ఏవండీ దోశ లేసా. ఏం నంచుకు తింటారూ? కారం పొడి వేస్తే చాలా? పల్లీ పచ్చడి చెయ్యాలా?" అంటే

"ఇంట్లో దిక్కుమాలిన దోశ ఏ పచ్చడితో తిన్నా విసుగే" అనేస్తారు.

దోశలేసేవాడికి పళ్ళాలు పట్టుకుని పెద్ద చాంతాడంత క్యూలో వస్తున్నవాళ్ళని చూస్తే తెగ చిరాగ్గా వుంటుంది. ఇంక అనకూడదు కానీ 'ఏ కొర నోములు నోచానో"'.. ఈ జన్మ ఇలా అయింది అన్నట్లు సిగ్గుతో వదిగిపోతూ ఓ పక్కగా ఉప్మా వుంటుందా, అందరూ తాతలకాలం నాటి హీరోయిన్‌ని చూసినట్లు చిన్నచూపు చూస్తూ ముందుకెళ్ళిపోతారు. ఇంక పథ్యానికైతే పనికొస్తుంది అన్నట్లు సపోర్టింగ్ ఆర్టిస్ట్‌లా ఇడ్లీ వుంటే, ఓపక్కన వేడి వడ వుంటేనే, ఐటెం సాంగ్ వున్న తెలుగు సినిమాలా కొంతదాకా జనాలని ఆకర్షిస్తుంది. 'వడలమ్ముకుని బతుకుతాం' అంటే, డబుల్ మీనింగ్ వస్తుందేమోనని, దాన్ని గారె అంటారు. కానీ కరకరలాడే వడలు ఎప్పుడూ క్లబ్ డాన్స్ స్టాండర్డే. నలుపు తెలుపూ చిత్రాల్లాంటి, ఇడ్లీవడా ఉప్మా, పొంగల్‌ని వదిలేస్తే లేటెస్ట్ బాలీవుడ్ గరం గరం హల్ చల్ లాంటి పానీపూరీ, చాట్, పావ్ భాజీల కౌంటర్లు అయితే మొదటిరోజు ఖాన్‌ల సినిమాల్లా కొంత హడావిడిగా వుంటాయి. పిల్లమూకంతా ఇక్కడే గాగ్రా చోలీలూ, లెహంగాలూ, పెళ్ళికోసం కుట్టించుకున్న జోధ్‌పూర్ షేర్వానీలూ, మెడల్లో వుత్తరీయాలని పోలిన బట్ట పీలికలూ, ఏ క్షణాన 'సిగ్గే సింగారమాయెనే ' అన్నా 'కళావతీ కలా ఇదీ?' అని వినిపించినా స్టెప్‌లెయ్యడానికి పూర్తిగా రెడీ అయిన కాస్ట్యూమ్స్‌లో "అదేవిటే పూరీల్లో ఆ పచ్చనీళ్ళు. వాడి చెయ్యంతా ముంచుతున్నాడు అసహ్యంగా, నాకొద్దు బాబూ" అనే బామ్మగారు మినహా, వయో బేధం లేకుండా సన్నీలియోన్ సినిమా ఫ్రీగా టీ.విలో వేస్తే చూసినట్లు, తాతయ్యలు కూడా కొద్దిగా లాలాజలం పెదవి అంచున కారుతుండగా దొప్పలు పట్టుకుని రెడీ అయిపోతారు. "మారే కాలంలో మారాలి మనమూనూ" అంటూ.

హాలీవుడ్ సూపర్ హీరోల సీక్వెల్ సినిమాల్లా ఇంకో పక్క పాస్తాలూ, పిజ్జాలూ, బర్గర్లూ వైపు సూటూ, టై కట్టుకున్నవాళ్ళు, బాబ్ కట్ అమ్మాయిల చెయ్యిపట్టుకుని వెళితే, "చింగ్ చింగ్ చాంగ్ చొంచో" అని సాగదీస్తూ చిన్న చిన్న కళ్ళని మరీ మూసేస్తూ డైలాగ్స్ చెప్పే చైనా కొరియన్ మూవీస్‌లాంటి న్యూడిల్స్, మొమోలు కూడా కుర్రకారుకి భలే పసందు.

ఏదో సంసారపక్షంగా, నిండా పమిట కప్పుకుని వున్న బొబ్బట్లూ, బోలెడు బట్టలు వేసుకుని నిన్నటి తరానికి నిదర్శనంగా వున్న పూతరేకులూ, బొద్దుగా ముద్దుగా పట్టుపావడాలతో సందడి చేసే బూరెలూ, పూజలూ పునస్కారాలతో ఒకింత గర్భగుడిలో కర్పూరపు వాసనలేసే పులిహోరా, చక్కెర పొంగళ్ళూ, బయట ఎన్ని వేషాలేసినా, ఇంటికొచ్చి పెళ్ళాం దగ్గర ఇవి తినాల్సిందేనన్నట్లు మావిడకాయ పప్పూ, వంకాయ అల్లం పచ్చిమిరపకాయ కూరా, దప్పళం, సాంబార్లూ, అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు బీపి, డయాబెటీస్‌తో వున్న వాళ్ళ పళ్ళాల్లో కనపడే పచ్చి కేరట్, కీరా, ఉల్లిముక్కలూ, అసిడిటీతో సీసాలు సీసాలు ఏంటాసిడ్‌లు తాగే వాళ్ళకోసం పెట్టిన పెరుగన్నం, ఐస్‌క్రీమ్‌లూ, ప్రాణ్, అమ్రిష్ పురీ, త్యాగరాజూ, రాజనాలా, ఇప్పటి ప్రకాష్ రాజ్, సుబ్బరాజుల్లా ప్రతినాయకులు లేకపోతే నాయకులు ఏం చేస్తారు? లాంటి ధీమాతో మిరప్పండ్ల కారం, ఎర్రని ఆవకాయా, టమాటా, ఉసిరీ, గోంగూరా, పప్పూ నెయ్యి కలుపుకున్నా, సాంబార్ కలుపుకున్నా పంటి కిందకి కమేడియన్‌ల హాస్యంలా నిండుదనాన్ని తెచ్చే చిట్టొడియాలూ, గుమ్మడి వడియాలూ, అప్పడాలూ, ఊరమిరపకాయలు ఓ పక్కా.

కడుపు నిండి భుక్తాయాసంతో చేర్లగిలబడి ఓ కుర్చీలో కూలబడితే కనువిందు చేసే పాత సినిమాల్లో జావళీలు, ఫోక్ డాన్స్‌ల్లా మీనాక్షీ, కిమాం, జర్దా, ఫైర్ పాన్లూ ఓ పక్కన "సలామ లేకుం సాహెబ్‌గారూ బలే జోరుగా వున్నారూ" అంటూ గెడ్డం బాబులు, నిప్పుతో సహా మన నోట్లో పెట్టేయడానికి రెడీ అయిపోతుంటే, కొద్దిగా మేలిముసుగు తొలిగించిన జవ్వనిలాంటి ఫ్లాస్కుల్లోంచి పట్టకారుతో పట్టుకుని మన నోట్లో పెట్టే నైట్రస్ ఆక్సైడ్‌తోవున్న పొగలు కక్కుతున్న మిఠాయిలు లాంటివి, మనం నోరు తెరిస్తే పొగలు" అవి విరులో, కురులో, అగరు పొగలో, అత్తరులో" అన్నట్లు వుంటే ఇంకో పక్క ఒకటే మా వయసూ.. ఒకటే మా సొగసూ" అన్నట్లు సంప్రదాయ నృత్యాలలాంటి జిలేబీలూ, బందరు లడ్లూ, బర్ఫీలూ, కాజాలూ బాజాలూ ఇంకో పక్క అయితే "కజరారే.. కజరారే.. ఏ కాలే కాలే నైనా" లాంటి పన్నీర్‌లూ, మంచూరియాలూ పుల్లలకి గుచ్చి, బొడ్డులో ముచ్చితరేకు పెట్టుకుని, నృత్యం చేసిన జ్యోతిలక్ష్మీ, హలం, జయమాలినీలని తలపిస్తాయి. టేబుల్ టేబుల్ దగ్గరకీ వచ్చి, ఒంపు సొంపులారబోసి మురిపించినట్లు ప్రతి కుర్చీ దగ్గరకీ వచ్చి పులకరింపచేసి, రెచ్చగొట్టి, సుతారంగా టిష్యూతో చుట్టి నోట్లో వేసుకునేట్లు చేస్తాయి. ఉట్టిమీద చల్ల చట్టీ, అమ్మవైపు చుట్టంలా 'ఆప్యాయంగా' వేసవిలో, లస్సీ అనో, మరో పేరుతోనో ఇచ్చే మజ్జిగలొక పక్క అయితే, "నా వంక చూడవే జిగేలు రాణీ.." అన్నట్లు "తీస్కో కోకాకోలా" అనే సోకు గత్తెల్లా, కోక్‌లూ, లిమ్కాలూనూ.

ఒళ్ళంతా నగలతో మొగుడి సంపాదనంతా తన ఒంటిమీదే పొరలు పొరలుగా దిగేసుకుని ఆపసోపాలు పడే అత్తయ్యగార్లలా, పింగాణీ ప్లేట్లు, పాపం పట్టినన్ని మిఠాయిలూ, వాటిమీద మసాలా కూరలూ, మధ్యలో బిర్యానీ, ఒట్టి అన్నం, దాని మీద పప్పూ, మళ్ళీ వెళ్ళలేం బాబూ కౌంటర్ దగ్గరకి అని వడ్డించుకుని వచ్చిన కప్పుల్లో సాంబారూ, రసం, పెరుగులతో కదలలేక, కదిలితే తులి పక్కనుండి వెళ్తున్న నీరజాక్షి తెల్లపట్టుచీర మీద సాంబార్ సిగ్గులొలకబోస్తూ, నళినాక్షి నల్ల పట్టుచీరమీద పెరుగు ప్రేమలొలకబోస్తూ, నిండుగా, అంచులు దాటి ప్రవహిస్తూ, ఫుడ్ కౌంటర్ల నుండి, టేబుల్స్ దగ్గరకి నిండు చూలాళ్ళలా ప్రయాణిస్తుంటాయి.

"స్వాగతం దొరా సుస్వాగతం.. క్రిష్ణవేణీ పిలిచీ కడుపు నింపగా, కన్నతల్లి కడుపు తీపి తాంబూలం ఇవ్వగా" అని పిలుస్తూ దీప తోరణాలతో, మండుతున్న నిప్పుల కుంపట్ల మీద, మెరుస్తున్న స్టీలు శఠగోపాలలాంటి పెద్ద పెద్ద మూతలున్న గిన్నెలతో పెళ్ళి పందిరంతా ఎగ్జిబిషన్‌కి ముస్తాబయిన స్టాల్స్‌లా ఆహ్వానిస్తుంటాయి. ఇవాళ ఏకాదశి ఉపవాశం.. పధ్నాలుగేళ్ళగా ఎన్నడూ మానలేదు" అన్న పిన్నిగారికి ఘుమఘుమలాడే బగారా బైగన్ వాసన, నియమాన్ని తుంగలో తొక్కమని ప్రేరేపించవచ్చు. నూనెలో తేలుతూ కన్నెపిల్లకన్ను గీటుతున్నట్లుగా మూకుడులోంచి, జల్లి గరిట మీదుగా బయటికి వస్తున్న మిర్చి బజ్జీలు ` ఊ అంటావా.. ఊఊ అంటావా?" ఏంటాసిడ్ వేసుకోవచ్చులే అని టెంప్ట్ చెయ్యచ్చు.

ఈ తిండీ తిరునాళ ఏవిటమ్మా? అని సణుక్కుంటూ ముసలమ్మలూ, తాతగార్లూ ఓ పక్క మనవలు తెచ్చిన అన్నం పెరుగూ, చారూ తింటూ విసుక్కోవచ్చు. ఇన్నివున్నా మాయాబజార్లో `వియ్యాలవారి విందులా`, కొంతమంది శల్యారావ్ బాబాయ్‌లూ, మావయ్యలూ "పనసపొట్టూ కూరేదీ? అబ్బే అది లేని పెళ్ళేవిటయ్యా?" అని వంకలు పెడ్తుంటే వేర్ ఈజ్ Lasagna ?" అనే ఇంపోర్టెడ్ పిల్లలు, పిజ్జా సుతారంగా కొరుకుతూ అసంతృప్తిగా దీర్ఘాలు తీయచ్చు.

"వియ్యాలవారి బంతేదిరా? బల్లలూ, కుర్చీలూ వేసి వెండి కంచాల ముందు, అరటి పండులో అగరు బత్తీలు గుచ్చి వియ్యపురాలిని ఏడిపిస్తూ" హడావిడీ వియ్యపురాలూ తేలుని తిందమ్మా" అని వరసైన వాళ్ళు నూనెలో వేయించిన పిండి తేలుకి ఆవాల కళ్ళు పెట్టి వియ్యపురాలి విస్తరిలో వేసి, గళ్ళున నవ్వే నవ్వులేవీ?

అబ్బాయీ అమ్మాయి తాళికట్టీ కట్టగానే నిండు పందిరిలో ఇంగ్లీషు కిస్సులు పెట్టుకుని, "రాములో.. రాములో నన్ను ఆగం చేస్తివిరో" అని, ఇద్దరూ గజ్జె కట్టి తెయ్యిన ఆడ్తుంటే, ప్రధమ స్పర్శా, ఇద్దరికీ ఒకరికి ఒకరు దగ్గరవ్వాలని నోట్లో ముద్దలు పెట్టించడం, బిందెలో ఉంగరం, మట్టెలూ వేసి ఎవరు తీస్తారో చూద్దాం అనుకోవడం, కాలు తొక్కించడం, చెయ్యి పట్టించడం ఇవన్నీ అవసరమా? మోడ్రెన్ పెళ్ళిళ్ళలో `నీ లీల పాడెద స్వామీ` అన్న నాదస్వరం ఉండదు" అందాల బొమ్మ రావేమే.. పందిట్లో పెళ్ళి జరిగేనే" అన్న సన్నాయి పాటలు వినిపించవు. "డించుక్..డించుక్" అన్న డిజేల రణగొణ ధ్వనే మారుమోగుతూ వుంటుంది.

**అయినా పెళ్ళి సందడి.. పెళ్ళిసందడే**

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4